# వ్యాఖ్యానములు

## భావం ప్రదర్శించ మనే కాదూ ?

"అడిగినవారి కల్లా అర్థము చెప్పుట కవియొక్క పని కాదు. యే యొక్కని కైనను చెప్పనే చెప్పడు. పూర్వకవు లందఱు వ్యాఖ్యానము లిచ్చిరేమీ యున్నారా ?........కాని భావకవిత్వ మని చెప్పి యెగతాళి చేసి తిట్టకండి. అది రుచించకపోయినా, అర్థము కాకపోయినా యిది యీనాటివాళ్ల వెఱ్ఱి యన్నట్లు త్రోసివేయండి కాని నిందించకండి. ఆకవికి అడ్డు రాకండి. ఆకవి తన యిష్టము వచ్చినట్లు భావాలను ప్రదర్శించుకొనుటకు స్వాతంత్ర్య మివ్వండి"

—దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు

భావకవుల కిప్పు డిది వొక వేషమయిపోయింది.

ఎవ రడిగినా, యెక్కడ అడిగినా, యేసందర్భంలో అడిగినా, యెందుకోసం అడిగినా వొకటే ధోరణి. పైగా "తిన పద్యాలకు కట్టు అర్థం చెప్పాడా ? టాగూరు చెప్పాడా ? చదివి బోధపరుచుకోలేనివాడికి చెబితే మాత్రం యేం తెలుస్తుందీ ?" అని యెదురు వాదం.

భావకవుల సమయాలు వేరు కావచ్చు. రచనాపద్ధతి కూడా కొత్తది కావచ్చు. భావాలు కూడా పరికొత్తవే కావచ్చు. ప్రాచీన సాంప్రదాయానుయాయులు యీనవీనతను గ్రహించలేకేపోవచ్చు; కాని తెలవనిచోట అడిగి తెలుసుకోవడం సిగ్గుమాలిన పని కాదు. కవులను అమర్యాద చెయ్యడం కూడా కాదు.

కవి శరీరం పాంచభౌతికమే. అంచేత క్షణభంగురమే ; కాని అతని జీవితం ధ్రువతార లాగ శాశ్వతం.

కవి మనిషే; కాని అతనిలో వుండేది దైవికాంశ.

కవి వొక్క చూపు చూశాడా, అక్కడె తళుక్కు మని మెరుపు మెరసినట్టుంటుంది.

కవి వొక్క పని చేశాడా, అందులో స్వేచ్ఛా, స్వాతంత్ర్యమూ చిప్పిలుతూ వుంటాయి.

కవి వొక్క పలుకు పలికాడా, అమృతం వొలికినట్టూ, వీణ జిలిబిలిపాట పాడినట్టూ వుంటుంది.

రసాధిదేవత అక్కడ లాస్యమే చేస్తుంది.

కవి జీవితం వొక మహాకావ్యం. ఆకవితో సమకాలికత్వం రసికుడికి వరప్రసాదం.

కావ్యం చదువుతూ వున్నప్పుడు, కవి, అక్కడ వుండా లన్న నిర్బంధం లేదు; కాని వుంటే మాత్రం అసలం శతశాఖల ప్రసరించినట్టు శోభావంతమై వుంటుంది.

కవి తన పద్యాలు తానే చదవా లని పట్టుబందీ లేదు; కాని చదివితే మాత్రం మలయమారుతం వీచినట్టు హాయిగా వుంటుంది.

కవి తన రచనలకు తానే అర్థం చెప్పా లని నియామకం యేమీ లేదు. అయితే; చెబితే మాత్రం పోతనీళ్లతో పెరిగే లతకూనమీద అమృతం వర్షించిన ట్టుంటుంది.

కవి సజీవుడై వుండనప్పుడు అతనికవిత్వం బోధపరుచుకుని విప్పి చెప్పగల వ్యాఖ్యాత బయలుదేరేదాకా కనిపెట్టుకుని వుండవలసిందే; కాని ఆకవి బతికే—కొద్దిదూరంలో—అతిసమీపంలోనే వున్నప్పుడు వ్యాఖ్యాతకోసం కనిపెట్టుకునివుండడం యేం అందమూ?

కాకపోయినా, కవి ఔన్నత్యాన్నీ, గాంభీర్యాన్ని పూర్తిగా గ్రహించడం వ్యాఖ్యాత కెప్పుడూ అసంభవమే. ఇలాంటి సందర్భంలో రుచులు మారిపోయిన కాలాంతరంలో సరియైన వ్యాఖ్యానం బయలుదేరడం అసాధ్యం కాదూ ?

మొన్నటిదాకా సారస్వతాన్ని రాజులే పోషించారు. ప్రతీ రాజూ తన సంస్థానంలో కవికి అగ్రతాంబూలం యిస్తూనే వచ్చాడు.

ఆరాజు లందరూ ఆకవుల నందర్నీ గ్రంథాలు రచించమని మాత్రమే నియోగించలేదు. నిండుకొలువుల్లో పద్యాలు చదివి మాత్రమే వూరుకో మనలేదు.

ఆకాలంలో కవులకు పోటీ అతితీవ్రంగా వుండేది. పండితుల విమర్శనాలు కూడా తీవ్రంగానే—కటువుగానే వుండేవి.

తన రచనలు శ్రావ్యంగా చదివి, అర్థం చక్కగా విప్పిచెప్పి, ప్రతిపక్షుల పూర్వపక్షాలను దృఢంగా యెదిరించి, తన రచనలు సమర్థించుకో గల కవికే అప్పుడు రాజాల సత్కారాలూ, ప్రజల పూజలూనూ.

పోనీ, యీ భావకవులు తమ రచనలను పత్రికలలోనూ, గ్రంథరూపంగానూ ప్రకటించి వూరుకుంటారా ? వీరందరూ పిలిచిన చోటల్లా—వేసిన ప్రతీసభలోనూ—అడగడం తరవాయిగా తమ పద్యాలు 'ఖూనీ' మ్మని చదువుతారు; కాని అర్థం చెప్పమనేటప్పటికి పైసాయిలో మాట్లాడతారు. ఏం ?

## హిందూమతంలో చోటు లేదు

మొన్నటి భూకంపంవల్ల క్వెట్టానగరమూ, తత్ప్రాంతమూ బగ్గం పాడయిపోయినప్పుడు చాలామంది హిందువులుకూడా నాశన మయిపోయారు.

కొన్ని కుటుంబాలలో పిల్లలు మాత్రమే మిగిలారు. మరికొన్ని కుటుంబాలలో తరుణవితంతువులు మాత్రమే నిలిచివున్నారు.

దొరతనంవారు, ఇతరమతాలవారితో పాటు వారిని కూడా రైళ్లలో తెచ్చి లాహోరులో విడిచిపెడుతున్నారు.

ఇలాంటి సమయంలో, మాహమ్మదీయులు, స్త్రీలా పురుషులా